# ప్రతి ఒక్కరు ఎవరో ఒకరైయుంటారు (యోహాను 4:1-42)

పిల్లలతో పనిచేసే సైకో థెరపిస్ట్‌కు (మానసిక రోగాలవైద్యుడు) ఏడేండ్ల బాలుడు ఈ దిగువ సూచించిన (ఉత్తరాన్ని) వ్రాశాడు.

> ప్రియమైన డాక్టర్ గార్డినర్ :
>
> నన్ను పీడించేదేమంటే - చాల రోజుల క్రిందట ఒక పెద్దతను 13 ఏండ్ల వయస్సువాడు - నన్ను సముద్రపు తాబేలు అని పిలిచాడు. నాకు ప్లాస్టిక్ సర్జరీ (శస్త్ర వైద్యం) జరిగింది గనుక అతడు నన్ను అలా పిలిచాడని తెలుసు. నా పెదవిని బట్టి దేవుడు నన్ను ద్వేషిస్తాడని అనుకుంటున్నా. నేను చనిపోయినప్పుడు బహుశా ఆయన నన్ను నరకానికి పంపుతాడేమో.
>
> ప్రేమ, క్రిస్.[1]

ఈ రోజుల్లో అనేకులు ఆత్మ గౌరవం లేనివారై బాధపడుతున్నారు. దీన్ని మనం ''స్వభావ నిమ్నత'' అని అంటాం. ఈ స్థితిని నీవు ఏమని పిలిచినా, ఈ స్వభావం కలవారు పెద్ద ప్రయోజన కారులుగా భావించుకోరు (అంటే, వారు దేనికి పనికిరామని అనుకుంటారు). (అందువలన) ''ప్రతి ఒక్కరు ఎవరో ఒకరై యుంటారు'' అని యిక్కడ నొక్కి చెప్పగోరుతున్నా. మన లేఖన భాగం - యోహాను 4. క్రొత్త నిబంధనలోని ఏ ఒక్క అధ్యాయం కంటెను యోహాను 4, ప్రభువైన యేసుయొక్క శీలాన్ని గూర్చి ఎక్కువగా తెలుపుతుందని అంటారు.

## వింతైన నిర్ణయం (యోహాను 4:1-4)

యోహాను 3, మన పాఠానికి పూర్వ దృశ్యాన్ని యిస్తుంది. యేసు పస్కా పండుగలో ఉన్నారు. ఒక రాత్రి వేళ నీకొదేమనే యూదుల అధికారితో ఆయన మాటలాడారు. ఆ సంభాషణలో యోహాను 3:16 యొక్క రమణీయమైన మాటలు వచ్చాయి. ఆ పండుగ తరువాత ఆయన యూదయలో కొంతకాలమున్నారు. అక్కడ గొప్ప విజయాన్ని పొందారు. ఆయన విజయం బాప్తిస్మమిచ్చు యోహానుయొక్క శిష్యులతో సంఘర్షణను కల్గించింది. అయినా 4:1లో సూచింపబడిందే ఆయనకు పట్టింపుగా ఉన్నట్టుంది. ''యోహానుకంటె యేసు ఎక్కువ మందిని శిష్యులనుగా

చేసికొని వారికి బాప్తిస్మమిచ్చుచున్న సంగతి పరిసయ్యులు వినిరని ప్రభువునకు'' తెలిసింది. తన మరణం అకాలంలో జరుగకుండే దానికిగాను, పరిసయ్యులతో ''ఎదురు బళ్లగా'' మోదుకొనడాన్ని ఆయన తప్పించుకోగోరారు. గనుక ఆయన యూదయను విడిచి, ఉత్తరముననున్న గలిలయకు వెళ్ల నిశ్చయించు కొన్నారు.

ఇట్టి పరిస్థితి మనలను ఒక వింతైన వచనానికి తెచ్చింది. ''ఆయన సమరయ మార్గమున వెళ్లవలసి వచ్చెను'' (4 వ.). పైనుండి క్రిందికి పాలస్తీనా 120 మైళ్ళుంటుంది. ఈ 120 మైళ్ళలో మూడు ఖచ్చితమైన భూభాగాలున్నాయి. ఉత్తరాన గలిలయ; దక్షణాన యూదయ ఉంటాయి. ఈ రెండింటికి మధ్యలో సమరయ ఉంది. సమరయ అంతర్భాగం గుండ వెళ్ళడాన్ని యూదులు సాధారణంగా తప్పిస్తారు. వారు తూర్పున యొర్దాను నదివరకు వెళ్ళి, నదిని దాటి, గలిలయ సముద్రం వచ్చేవరకు పెరయ మార్గాన వెళ్ళుతారు. ఆ మీదట గలిలయకు చేరడానికి తిరిగి యొర్దాను నదిని దాటుతూ వుంటారు. తిన్నగా వెళ్ళితే అది మూడు దినాల ప్రయాణమే. ఇలా చుట్టు తిరిగి పోతే ఆరునుండి తొమ్మిది దినాలు పడుతుంది. ఇది దాదాపు లాస్ ఏంజిల్స్‌నుండి న్యూయార్కుకు మెక్సికో పట్టణం మీదుగా వెళ్ళేదానికి సమానంగా ఉంటుంది.

(అయితే) యేసు సమరయ గుండ వెళ్ళవలసిన అవసరమేమి? యోహాను చెరసాలలో వేయబడిన కారణాన ఆయన తొందరగా గలిలయ వెళ్ళగోరినట్టు చెప్పబడింది. యోహాను యొక్క శిష్యులు చెదరి పోకుండేలా ఉంచాలని ఆయన కోరాడట. అయితే ఆయన సుఖారులో రెండు దినాలు నిలిచియుండడం - అలాటి భావనను తొలిగిస్తుంది. యేసు ఎందుకు అలా వెళ్ళవలసి వచ్చిందంటే - ప్రత్యేకమైన స్త్రీ ఒకతె ఆ పట్టణంలో వుంది; (పైగా) విలువైన ఆత్మలు దానిలో (యింకా) ఉన్నాయని నేనంటున్నా, కోతకు వచ్చిన ఆత్మసంబంధమైన పంట అక్కడ ఉంది. దేవుని దృష్టిలో ప్రతి ఒక్కరు ఎవరోఒకరైయున్నారు.

## పాపియైన స్త్రీ (యోహాను 4:5-8)

''యాకోబు తన కుమారుడైన యోసేపు కిచ్చిన భూమి దగ్గరనున్న సమరయలోని సుఖారను ఒక ఊరికి వచ్చెను'' (5వ.). ''అక్కడ యాకోబు బావి ఉండెను'' (6a వ.). బైబిలు భూభాగాల్లో ''ఇది ఫలాని చోటు'' అని చెప్పడానికి (నేటికిని) నిలిచియున్న వాటిలో యిది ఒకటి. ఈ బావి యింకావుంది. సుఖారు అనే ప్రాచీన పురానికి దాదాపు అరమైలు దూరంలో ఈ బావి ఉంది. ''గనుక యేసు ప్రయాణము వలన అలసియున్న రీతినే ఆ బావియొద్ద కూర్చుండెను'' (6bవ.). యేసు దేవుని కుమారుడని తన సువార్త రచనలో రుజువు చేయబూనుకొన్న యోహాను, తక్కిన సువార్త లేఖికులకంటె

ఎక్కువగా ఆయన మానవత్వాన్ని సూచించాడు. ''దప్పిక గొని యున్నా'' నని (యోహాను 19:28) సిలువపై ఆయన పలికిన మాటలను యోహాను రికార్డు చేశాడు. ఆయన అలసి యున్నాడు; దప్పిక గొన్నాడు; ఆకలి గొన్నాడు. మనకు వలెనే ఆయన వ్యయం చేయబడ్డారు.

యూదుల లెక్క ప్రకారం అప్పుడు ఆరు గంటల వేళైంది. మనకు అది ''ఇంచుమించు పండ్రెండు గంటలాయెను'' (6c వ.) అని తర్జుమా చేయబడింది. ''ఆయన శిష్యులు ఆహారము కొనుటకు ఊరిలోనికి వెళ్ళిరని'' 8వ వచనం సూచిస్తుంది.

''సమరయ స్త్రీ ఒకతె నీళ్లు చేదుకొనుటకు అక్కడికి'' వచ్చింది (7a వ.). ఈ కొద్ది మాటలే ఆమెను గూర్చి ఎన్నో సంగతులను తెలుపుతున్నాయి. స్త్రీలు సాధారణంగా నీళ్లు చేదుకోడానికి మధ్యాహ్నం రారు. ఉదయ, సాయంకాలాలలో నీళ్లు తెచ్చుకుంటారు, నీళ్లు తెచ్చుకొనడమనేది సాంఘీక కార్యక్రమం; సామాజిక చర్య. స్త్రీలు ఒకరితోనొకరు కలిసికొని చల్లపూట వేళలలో మాటలాడుకొంటూ పోతుంటారు. అయితే ఈ స్త్రీ మధ్యాహ్నపు ఎండవేళలో వచ్చింది. నీళ్ల కొరకు ఈ స్త్రీ అరమైలు (దూరం) నడిచి వచ్చింది. దీనంతటిని బట్టి చూస్తే, ఈమె పట్టణంలోని స్త్రీల మధ్యనుండి వెలివేయబడిన దానిలా కన్పిస్తుంది. మిగిలిన స్త్రీల యొక్క గుసగుసలు, చూపులు అనేవాటినుండి తప్పించుకొనడానికే యిలాటి మార్గాన్ని వెదక్కున్నట్టు అనిపిస్తుంది.

## ఆశ్చర్యాన్ని కలిగించే వినతి (యోహాను 4:7, 9)

''యేసు - నాకు దాహమునకిమ్మని ఆమెనడిగెను ... ఆ సమరయ స్త్రీ - యూదుడవైన నీవు సమరయ స్త్రీనైన నన్ను దాహమునకిమ్మని యేలాగు అడుగు చున్నావని ఆయనతో చెప్పెను'' (7b, 9a వ.).

ఇలాటి ఇచ్చి, పుచ్చుకొనడాన్ని అర్థం చేసికోవాలంటే - యూదులకు సమరయులకు మధ్య ఉండిన సంబంధాన్ని కొంతవరకు మనం తెలిసికోవాలి. జాతుల సమస్యలను మనం చూచాం. జాతుల మధ్య ఏర్పడిన అకారణ ద్వేషబుద్ధి దేవుని హృదయాన్ని పగలగొడుతుంది. అయితే యూదులు సమరయులనే వారి మధ్య నెలకొన్న పరిస్థితిని పోలినది మనం ఎక్కడా చూచి యుండం. ఇది చాల సంవత్సరాలనుండి వస్తుంది. సమరయులు సంకరజాతివారు. ఇశ్రాయేలు పది గోత్రాలవారు అష్షూరీయుల చేతికి (క్రీ.పూ. 727) అప్పగింపబడిన తరువాత యిది ఏర్పడింది. ఉత్తర భాగంలో మిగిలిన ఇశ్రాయేలీయులు పాలస్తీనా ఉత్తర భూభాగానికి అష్షూరీయులచే పంపబడిన అన్యులతో కలిసి వివాహం చేసికొన్నందున

వీరు వచ్చారు. జాతి పవిత్రతను పోగొట్టుకొనడం యూదులకు "క్షమించరాని పాపం" ఈ రోజుకు కూడా, నిష్ఠగల యూదుల కుటుంబంలోని పిల్లలు యూదుల విశ్వాసానికి వెలుపల ఎవరినైనా వివాహం చేసికొంటే, అలా చేసికొన్న బిడ్డకు "ఉత్తర క్రియలు" చేస్తారట; అంటే వారి దృష్టిలో ఆ బిడ్డ చచ్చినట్టే.

(అదెలాగున్నా) యేసు ఆ స్త్రీతో మాటలాడడంలో మూడు వింతైన వాస్తవాలున్నాయి: (1) ముందుగా గమనించినట్టే, (ప్రభువైన) యేసు దాహమున కిమ్మని అడిగింది ఒక సమరయ జాతికి చెందిన వ్యక్తిని. (2) ఈ వ్యక్తి యొక స్త్రీ. యూదా పురుషులు స్త్రీలతో బహిరంగంగా ఏ సంబంధమూ పెట్టుకోరు (27వ.). యూదా మతపు రబ్బీయైతే కనీసం తన భార్యతోనైనా, కుమార్తెతోనైనా బహిరంగంగా మాట్లాడడు. పరిసయ్యులలో "గాయపరచబడి రక్తముకారు" అనే తెగ ఒకటుంది. (వీరి మార్గంలో స్త్రీ ఎదురు పడితే కనీసం ఆమెను కంటితోనైనా చూడరు). గనుక ఎప్పుడైనా వారి మార్గంలో స్త్రీ ఎదురుపడితే కండ్లు మూసికొని పరుగెత్తుతూ గోడలకో, చెట్లకో, అలాటి మరిదేనికో గుద్దుకొనేవారట. (3) (అలాటి పరిస్థితిలో) ఈమె కేవలం స్త్రీ మాత్రమే కాదు, తన నైతిక శీలం ప్రశ్నింపబడిన పరిస్థితిలోనున్న స్త్రీ.

3, 4 అధ్యాయాల్లో యేసు ఎదుర్కొన్న వ్యక్తుల మధ్య ఉద్దేశపూర్వకంగా చేయబడిన తారతమ్యాలు గోచరిస్తాయి. యోహాను 3లో (1) ఒక యూదుని, (2) పురుషుని, (3) ఉన్నతమైన నైతిక విలువలు గలవానిని ప్రభువు కలిసికొన్నారు. యోహాను 4లో బావి దగ్గర (1) సమరయ జాతి వ్యక్తిని, (2) స్త్రీని, (3) హీనమైన నైతిక శీలముగల దానిని ఆయన కలిసికొన్నారు. వీరిద్దరికినీ రక్షణ అవసరమే. యేసు నీకొదేమును ఎంత దయగా, కనికరముగా, మర్యాదగా చూచారో అలాగే ఆమెను కూడా చూచారు. ఎందుకు? *ప్రతి ఒక్కరు ఎవరో ఒకరైయుంటారు గనుకనే!*

నీవు మతస్థుడవో, మతంలేనివాడవో, నీవు స్త్రీవో పురుషుడవో, ఉన్నతమైన నైతిక విలువలుగల వ్యక్తివో లేక నీ జీవితమంతా సమస్యలతో నిండియున్న వ్యక్తివో సమాజంలో నీకు ఉన్నతమైన స్థానముందో, లేక కేవలం ఎన్నికలేని స్థితిలోనే ఉన్నావో - నీవెలాగున్నా - దేవుడు నిన్ను ప్రేమిస్తున్నాడు. నీవు దేవుని స్వరూపంలో చేయబడ్డావ్ (ఆది. 1:26). నీవు దేవునికి ఒక ప్రత్యేకమైన వ్యక్తివి. యేసు నీకొరకు సిలువలో మరణించారు. ఆయన మరణించడం అవసరమని నీవనుకుంటే కూడ నీకొరకు మరణించియుండేవాడే.

బావి దగ్గర యేసు ఆ స్త్రీతో చేసిన సంభాషణలో ఇలాటి వివరణను యోహాను చూపించాడు. "ఏలయనగా యూదులు సమరయులతో సాంగత్యము చేయరు" (9వ.). అంటే, యూదులకు, సమరయులతో ఎలాటి వ్యవహారాలుండవని దాని భావం కాదు. వారి మధ్య ఆర్థిక వ్యవహారాలుంటాయి. కనుకనే శిష్యులు సమరయుల

పట్టణంలో ఆహారం కొంటానికి వెళ్ళారు. అయితే సహజమైన సాంఘీక వ్యవహారాలు వారిమధ్య ఉండవని యోహాను నొక్కి చెప్పుతున్నాడు. ''యూదులు సమరయులు ఒకే రకమైన పాత్రలు వాడరు'' అని NEB పర్యాయ తర్జుమా నిస్తుంది. సమరయుల పాత్రలు అపవిత్రమైనవని యూదులు వాటిలో తినరు త్రాగరు. అయినా ప్రభువు ఆ స్త్రీని దాహమునకిమ్మని అడిగారంటే, తన పాత్రలోని నీటిని త్రాగడానికి ఆయన సిద్ధంగా ఉన్నాడన్న మాట. అలా తన ప్రజల ఆచార వ్యవహారాలకు వ్యతిరేకంగా యేసు ఎందుకు వెళ్లగోరారు. ఎందుకంటే - ఆ స్త్రీ ఆయనకు ప్రత్యేకమయింది. ఎందుకంటే - ప్రతి ఒక్కరు ఎవరోఒకరైయున్నారు.

## ఉలికి పడే వాంగ్మూలం (ప్రతిపాదన) (యోహాను 4:10-15)

(యేసు లోకానికి దేవుని కృపాదానమై యున్నాడు) ''యేసు - నీవు దేవుని వరమును - నాకు దాహమునకిమ్మని అడుగుచున్న వాడెవడో అదియు ఎరిగియుంటే నీవు ఆయనను అడుగుదువు, ఆయన నీకు జీవజలమిచ్చునని ఆమెతో చెప్పెను'' (10వ.). బావిలో నిలిచియుండే నీటికి భిన్నంగా, ప్రవహించుతూ ఉండే నీటిని యూదులు జీవజలమంటారు (ప్రవహించే నదులను మనం జీవ నదులు అనడంలా? అలాగే). అయినా అతి ప్రాముఖ్యమైన సంగతి ఏమంటే - ఒక వ్యక్తిలోని ఆత్మ సంబంధమైన తృష్ణ - దేవుని శక్తి. ఆయన ప్రసన్నతలవలన తీర్చబడడాన్ని ''జీవజలమని'' ప్రవక్తలు వ్యవహరించేవారు. ఆత్మ సంబంధంగా జీవించబోయే జీవితానికి పుష్టి నిచ్చేదిగా ప్రభువు దీన్ని సూచించారు.

> తరచుగా ఎదురౌతున్నట్టే, ప్రభువు యొక్క ఈ విద్యార్థి కూడా ఆయన్ను అర్థం చేసికొనలేదు. ''అప్పుడా స్త్రీ - అయ్యా, యీ బావి లోతైనది, చేదుకొనుటకు నీకేమియు లేదే; ఆ జీవజలము ఏలాగు నీకు దొరుకును? తానును తన కుమాళ్లును, పశువులును, ఈ బావి నీళ్లు త్రాగి మా కిచ్చిన మన తండ్రియైన యాకోబు కంటె నీవు గొప్పవాడవా? అని ఆయనను అడిగెను'' (11-12 వచ.).

యేసుతో తన శ్రోతలు యిలాటి పరిస్థితిని సహజంగానే ఎదుర్కొంటున్నారు. గూఢమైన భాషలో ఉలికిపడే ప్రతిపాదనను ఆయన చేస్తూ ఉంటారు. దాన్ని అక్షరార్థంగా తీసికొని శ్రోతలు అపార్థం చేసికొంటారు. అప్పుడు ప్రభువు వారిని ఆత్మ సంబంధమైన గ్రహింపుకు నడిపిస్తారు.

''అందుకు యేసు - ఈ నీళ్లు త్రాగు ప్రతివాడును మరల దప్పిగొనును, నేనిచ్చు నీళ్లు త్రాగు వాడెప్పుడును దప్పిగొనడు'' (13వ.). ఈ జీవితానికి సంబంధించిన ప్రతిదాని విషయంలో అది సత్యమే. మనం నీల్లు త్రాగుతాం; మరల దప్పిక గొంటాం. భోజనం చేస్తాం, మరల ఆకలి గొంటాం. మనకు కొన్ని మంచి సమయాలుంటాయి. అయితే సంతోషకరమైన అప్పటి అనుభవాలు మాసిపోతాయి, తిరిగి సంతోషం కొరకు

వెదకుతాం. విజయమో, పలుకుబడో, లేక ఆనందమో - ఈ జీవితానికి సంబంధించిన ప్రతిదీ తొందరలోనే గతించిపోతుంది.

"నేను వానికిచ్చు నీళ్లు నిత్యజీవమునకై వానిలో ఊరెడు నీటి బుగ్గగా ఉండునని" అంటూ యేసు (తన మాటలను) కొనసాగించారు (14వ.). క్రైస్తవ జీవితంలో ఉండే బలం, సంతోషం, శక్తి అనే వాటిని గూర్చి ఆయన మాట్లాడారు. వాస్తవంగా యేసు తెలిపిందేమంటే - ''మెస్సీయా ద్వారా ఏవేవి లభిస్తాయని ప్రవక్తలు పలికారో వాటన్నిటిని నేను తెస్తున్నాను. నీవు సమృద్ధియైన జీవం (వాటిద్వారా) పొందవచ్చు''.

---

**యేసు మన హృదయాలలోనికి, జీవితాలలోనికి చూచినప్పుడు - మన మంచితనాన్ని, దాగియున్న శక్తిని, దేవుని సహాయంతో మనం ఏమి కాగలమో దాన్ని ఆయన చూస్తారు.**

---

ఈ మాటలు ఆ స్త్రీకి అద్భుతంగా ఉన్నా, యింతకు ఆయన ఏమి మాట్లాడుతున్నారో సరిగా తెలియలేదు. గనుక, ''ఆ స్త్రీ ఆయనను చూచి - అయ్యా, నేను దప్పిక గొనకుండునట్లును, చేదుకొనుటకింత దూరము రాకుండునట్లును, ఆ నీళ్లు నాకు దయచేయుము'' అని అడిగింది (15వ.). ఆమె భావన - ''అది గొప్పగా వుంది! నీళ్లు తెచ్చుకోడానికి ఎండవేళలో అరమైలు దూరం యిక వచ్చేది లేదు. ఈ కుండను మోయడంలో అలసిపోయాను'' - అన్నట్టుంది.

### మితానుభవంతో కూడిన ప్రశ్న (యోహాను 4:16-18)

ఇప్పుడు యేసు ఆ స్త్రీయొక్క శ్రద్ధను పొందారు. ఆమె హృదయాన్ని ఆపరేషన్ చేయడానికి ఆయన సిద్ధంగా ఉన్నారు. యేసు పిరికి శస్త్రవైద్యుడు కాడు. గనుక - ''నీవు వెళ్లి నీ పెనిమిటిని పిలుచుకొని యిక్కడికి రమ్మని'' ఆమెతో అన్నారు. ప్రభువునొద్దకు రాకముందు మనం ఆగి ... దేవుని వాక్యమనే అద్దంలో మనమె లాగున్నామో నిష్కపటంగాను యథార్థంగాను మనలను మనమే చూచుకోవాలి.

అయితే ఆ స్త్రీ నాకు పెనిమిటి లేడని సమాధానమిచ్చింది. ఇంతవరకు జరిగిన సంభాషణలో మాటలాడడానికి ఆమె వెనుకంజ వేయలేదు. ఆమె దాదాపుగా ''ఎడాపెడ'' కొట్టుతునేవుంది. ఇప్పుడైతే, చెప్పడానికి ఎక్కువ మాటలు లేవు.

ఇంగ్లీషులో నాలుగు పదాలు ఉన్నాయిగాని; గ్రీకులోనైతే మూడు మాటలే ఉన్నాయి. (దీన్ని బట్టి) తన యిబ్బందిని మనం గ్రహింపవచ్చు.

''యేసు ఆమెతో - నాకు పెనిమిటి లేడని నీవు చెప్పిన మాట సరియే; నీకు ఐదుగురు పెనిమిట్లుండిరి. ఇప్పుడు ఉన్నవాడు నీ పెనిమిటికాడు, సత్యమే చెప్పితివనెను'' (17b -18 వ.).

ప్రభువును ముఖాముఖిగా సందర్శించే తొలి సమయంలో అసౌకర్యమైన అనుభూతిని (సహజంగా) కలుగుతుంది. ఈ సంఘటన జరిగిన తరువాత యేసు గలిలయకు వెళ్లి తిరిగి కపెర్నహోమునకు వచ్చారు. పేతురైతే తిరిగి చేపలు పట్టడానికి వెళ్ళాడు. లూకా 5లో అద్భుతరీతిగా చేపలు పట్టిన సంభవముంది. ప్రభువుతో పేతురు అప్పటికే ఎక్కువగా ప్రయాణాలు చేసియున్నాడు. అయినా తొలిసారిగా యేసును తన మహిమలో, శక్తిలో పేతురు చూచాడు. ఆయన మహిమ యెదుట తన్ను తాను చూచుకొన్నాడు ''ప్రభువా, నన్ను విడిచిపొమ్ము, నేను పాపాత్ము డనని'' పేతురు విలపించాడు (లూకా 5:8).

సువార్త సందేశంలో దోషారోపణకు ఏ పాలు లేదంటారు గాని, అది ఉంది. మన జీవితాంతంవరకు దోషారోపణతో ఉండాలని దేవుడు కోరడు, గాని ఆత్మసంబంధమైన మన అవసరతల యొక్క గ్రహింపుతో తన కృపాకనికరాలను ఆయన అభినందించగోరతాడు.

ఈ స్త్రీ ఎవరు తానేమైయుంది అనే విషయాలు ప్రభువునకు పూర్ణంగా తెలుసు. ఆ తరువాత పాపాత్ములైన స్త్రీని కూడ తనకు నూనె పూయనిచ్చారు. ఆయన శత్రువులు ఆ స్త్రీ ఎలాటిదో ఆయనకు తెలియదని భావించారు. ఈ సమరయ స్త్రీ ఎలాటిదని ఆయనకు తెలుసో, అలాగే ఆమె కూడా ఎలాటిదో యేసుకు తెలుసు. ఈమె ఆయనకు యింకను ప్రత్యేకంగానే వుంది. మన జీవితాల్లోనికి, హృదయాల్లోనికి, యేసు చూచినప్పుడు ఆయన మన చెడుతనాన్ని, సమస్యలను, పోరాటాలను మాత్రమే కాదు, మన మంచి తనాన్ని, మనలో దాగియున్న శక్తిని, దేవుని సహాయం వలన మనమేమి కాగలమో అనే వాటిని సహితం ఆయన ఎరుగును. ఈ సందర్భంలో దాదాపు పట్టణమంతా విశ్వాస పథములో నడిచేలా ప్రారంభించగల స్త్రీని ఆయన చూచారు. ప్రభువైన యేసునకు ప్రతి ఒక్కరు ఎవరో ఒకరైయుంటారు.

## ప్రాముఖ్యమైన (విశేషమైన) చర్చ (యోహాను 4:19-26)

ఆ స్త్రీయొక్క ఆత్మ సంబంధమైన అవసరతలను బయట పెట్టినప్పుడు, ఆమె ఎలాటి ప్రతిచర్య జరిగించింది? తాను అంశాన్ని మార్చేసినట్టు కన్పిస్తుంది (19 వ.). ఎవరితోనైనా, వాక్యాన్ని చదువుతూ, ఆత్మసంబంధమైన వారి అవసరతల కడకు వచ్చినప్పుడు, ఆ అంశాన్ని మార్చిన వ్యక్తిని చూచావా? (లేకుంటే ఇప్పుడు

చూడు).

''అప్పుడా స్త్రీ - అయ్యా, నీవు ప్రవక్తవని గ్రహించుచున్నాను'' అని అంది. సమరయులు పాత నిబంధనలోని తొలి ఐదు రచనలనే ఉపయోగించేవారు. ఈ రచనలు ప్రవక్తలను గూర్చి అంతగా తెలుపవు. అయినా, వారు అంగీకరించే దానికంటె ఎక్కువగా వారు యూదులచే బోధింపబడినట్టున్నారు. సమరయ స్త్రీకి ప్రవక్తలను గూర్చి తెలుసు. యేసు వారిలో ఒకడని ఆమె భావించినట్టుంది.

తాను పలికిన మాటలు ఎలాగున్నాయంటే - ప్రవక్తా, నిన్నొక ప్రశ్న అడుగనీ! ''మా పితరులు ఈ పర్వతం మీద ఆరాధించేవారు'' (20b వ.). నెహెమ్యా సమరయులకు సహాయం చేయ నిరాకరించినప్పుడు, గెరెజీము కొండమీద వారు తమ దేవాలయాన్ని కట్టుకున్నారు. గెరెజీమును కొండను గూర్చి తమాషాయైన గొప్ప కథలు జనులు కల్పించుకున్నారు. అది అబ్రహాము ఇస్సాకును బలి యిచ్చిన కొండని; (అదే) అబ్రాహాము మెల్కీసెదెకును కలిసికొన్న కొండని; ఇశ్రాయేలీయులు వాగ్దానభూమిలో ప్రవేశించిన తరువాత, వారు దేవునికి తొలిబలి పీఠాన్ని కట్టించిన కొండయని వారు నమ్మేవారు.

సుఖారునకు సమీపంలోనున్న గెరెజీము కొండ సమరయులకు అతి పవిత్రమైనది. ఆ కొండ వైపు సమరయ స్త్రీ తన చెయ్యి చాపి యుండవచ్చు. మీరు (యూదులైతే) ''ఆరాధించవలసిన స్థలం యెరూషలేములో ఉందంటారు'' (20b వ.). ''ఏది సరియై''నది? - అనే ప్రశ్న తన మాటల్లో దాగియున్నది.

ఆ రెండింటిలో ఏదీ రైటుకాదని ప్రభువు సమాధాన మిచ్చారు. ''అమ్మా, నా మాట నమ్ముము, ఒక కాలము వచ్చుచున్నది, ఆ కాలమందు, ఈ పర్వతము మీద నైనను యెరూషలేములోనైనను తండ్రిని ఆరాధింపరు'' (21 వ.). రాబోయే మెస్సీయా రాజ్యంలో వ్యక్తియేగాని, స్థలం ప్రాముఖ్యమయ్యింది కాదు. వెయ్యేండ్ల పరిపాలనా వాదమైతే యెరూషలేము ఆరాధనకు కేంద్రంగా పునరుద్ధరింపబడుతుందని అంటుంది. అలాటిది ఏదీ జరుగబోదని ప్రభువు మాటలే తెలుపుతున్నాయి.

ఇంకను ప్రభువు యిలా అన్నారు. ''మీరు మీకు తెలియని దానిని ఆరాధించువారు, మేము మాకు తెలిసినదానిని ఆరాధించువారము. రక్షణ యూదులలో నుండియే కలుగుచున్నది''. యూదా జనాంగంనుండి మెస్సీయా వచ్చారు. పేతురు పౌలుల వంటి తొలి సువార్తికులు యూదుల్లోనుండి వచ్చినవారే. ఆది క్రైస్తవులు కూడా యూదులే.

యేసు ఆ స్త్రీయందు ప్రేమ, అక్కరలు కలిగియున్నా, నైతికంగాను, సిద్ధాంత పరంగాను తాను తప్పులో ఉన్న సంగతి తెలపడానికి వెనుకాడలేదు. ఒకవేళ మనం

ఎవరినైనా అంగీకరించామంటే, వారి జీవితంలోని తప్పులను అంగీకరించామని కాదు. ఒక స్నేహితుడు నైతికంగానో, సిద్ధాంతపరంగానో తప్పులో వున్నప్పుడు, తనకు ఆ సంగతి తెలుపక పోయినట్లయితే, అది ప్రేమ అనబడదు; దాన్ని ప్రేమలేని తనమంటారు.

ఆ తరువాత యేసు యిలా అన్నారు: ''అయితే యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చేయున్నది; తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు'' (22 వ.). (అప్పటికి రాజ్య స్థాపన లేక సంఘ స్థాపన కొన్ని నెలల దూరంలోనే వుంది). అయినా, ఆరాధించేది ''ఎక్కడ?'' అనేది ప్రాముఖ్యం కాదు. ''ఎవరిని?'' ''ఎలా?'' అనేవే ప్రాముఖ్యం. ''ఎవరిని?'' - ''తండ్రిని''. ''ఎలాగు?'' - ఆత్మలో - దేవుడు కోరినట్టు - హృదయ పూర్వకంగా; ''సత్యముతో'' - దేవుని ఉపదేశాన్ని అనుసరించి. యోహాను 17లో ప్రభువు చేసిన గొప్ప ప్రార్థనలో - ''నీ వాక్యమే సత్యము'' అని యేసు అన్నారు (యోహాను 17:17).

సత్యారాధన యొక్క సంగ్రహం యిలా సూచింపబడింది: ''దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెను'' (24 వ.). ఈ లేఖనంనుండి ఆరాధనను గూర్చి మనం ఎక్కువగా నేర్చుకోవచ్చు. అయితే ఈ పాఠంలో ప్రాథమికంగా యేసుతో ఆయన చుట్టు చేరిన వారికున్న సంబంధాన్ని గూర్చి తెలిసికొనడంలో అక్కర కలిగియున్నాం.

''ఆ స్త్రీ ఆయనతో - క్రీస్తనబడిన మెస్సీయా వచ్చునని నేనెరుగుదును; ఆయన వచ్చినప్పుడు మాకు సమస్తమును తెలియ జేయునని'' చెప్పింది (25వ.). మెస్సీయా అనే భావన సమరయులు యూదులనుండి అరువు తెచ్చుకున్నారు. ఏది ఎలాగున్నా, ఆ స్త్రీ యొక్క విశ్వాసం ఎలా పెదుగుతుందో గమనించు. మొదట యేసును ఆమె యూదుడంది (9 వ.). తరువాత ''అయ్యా'' అని అంది (11వ.). ''అయ్యా'' అక్షరార్థంగా ''ప్రభువా'' అని! తరువాత ''ప్రవక్త'' యని గుర్తించింది (19వ.). ఇప్పుడు ఆమె ఆయనకు ''మెస్సీయా''ను గూర్చి జ్ఞాపకం చేసింది (25వ.). ఆ తరువాత ఆయనే మెస్సీయా అని యితరులకు పరిచయం చేసింది (29వ.).

''యేసు - నీతో మాటలాడుచున్న నేనే ఆయనని ఆమెతో'' చెప్పారు (26వ.). యేసు ఏమన్నారంటే, - నీవు మెస్సీయా కొరకు కనిపెడుతున్నావ్. ఆయనను నేనే. నీవు సమాధానాల కొరకు చూస్తున్నావు - నేనే. సహాయం కొరకు నిరీక్షణాధారం కొరకు వెదకుతున్నావ్ - వాటికీ నేనే. అంతరంగ తృష్ణ తీర్చబడే దాని కొరకు ఎదురు చూస్తున్నావ్. దానికీ నేనే!

## ఈ సంఘటనకు నడుమ పురికొల్పే విరామకాలం
## (యోహాను 4:27-38)

భోజనంతో శిష్యులు తిరిగి వచ్చారు. ''ఇంతలో ఆయన శిష్యులు వచ్చి ఆయన స్త్రీతో మాటలాడుట చూచి ఆశ్చర్యపడిరి. గాని - నీకేమి కావలెననియైనను, ఈమెతో ఎందుకు మాటలాడుచున్నావని యైనను ఎవడును అడుగలేదు'' (27 వ.).

ఆ స్త్రీ తన కుండను విడిచిపెట్టింది (28వ.). తాను కుండ విడిచి పెట్టి వెళ్లడంలో తన ఉత్సాహాన్ని మాత్రమే గాకుండ, తాను తిరిగి వస్తానన్న వాస్తవాన్ని కూడా సూచించింది.

> ఆ స్త్రీ - ''ఊరిలోనికి వెళ్లి - మీరు వచ్చి, నేను చేసినవన్నియు నాతో చెప్పిన మనుష్యుని చూడుడి, ఈయన క్రీస్తు కాడా అని ఆ ఊరి వారితో చెప్పగా, వారు ఊరిలోనుండి బయలు దేరి ఆయన యొద్దకు వచ్చుచుండిరి'' (28-30వచ.). (ఆమె చెప్పింది పురుషులతో స్త్రీలతో కాదు).

సమరయులు బావి యొద్దకు వస్తూవుండగా, తన శిష్యులకు బోధించడానికి యేసు ఆ సమయాన్ని వినియోగించుకొన్నారు.

> ''ఆలోగా శిష్యులు - బోధకుడా, భోజనము చేయుమని ఆయనను వేడుకొనిరి. అందుకాయన - భుజించుటకు మీకు తెలియని ఆహారము నాకు ఉన్నదని వారితో చెప్పగా, శిష్యులు ఆయన భుజించుటకు ఎవడైన నేమైనను తెచ్చెనేమో అని యొకనితో ఒకడు చెప్పుకొనిరి. యేసు వారిని చూచి - నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమైయున్నది'' (31-33వచ.).

ఆయన నీకొదేముకు బోధించినట్లే, ఆ స్త్రీకి బోధించారు; అదే రూపంలో తన అపొస్తలులకు బోధించారు. ఆయన మాటలను వారు అక్షరార్థంగా తీసికొని అపార్థం చేసికొనేలా మొదట గూఢమైన ప్రతిపాదన చేశారు; ఆ తరువాత ఆత్మ సంబంధమైన భావానికి యేసు వారిని నడిపించారు.

"నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పనిని తుదముట్టించుటయు నాకు ఆహారమైయున్నది" (అంటే, నా ఆత్మ సంబంధమైన భోజనం తండ్రి చిత్తం నెరవేర్చడమేనని) (34 వ.). తమ బోధకుని అర్థం చేసికొనడం ఆయన అనుచరులకు కష్టతరంగానేవుంది. అయినా ఆయన వారి హృదయ కాఠిన్యం విషయంలో ఆలోచన గలవాడైయున్నాడు. వారికి సంగతులను వివరించడంలో ఆయన ఓపిక గలవాడైయున్నాడు. ఎందుకంటే - ప్రతి ఒక్కరు ఎవరో ఒకరైయున్నారు.

యేసు భోజనంనుండి, దానికి ఆధారమైన పంటవైపుకు చిత్రాన్ని మరల్చారు. కోతకాలం కొరకు కనిపెట్టే యూదుల సామెతను యేసు వారికి ఎత్తి చూపారు. ''ఇంక నాలుగు నెలలైన తరువాత కోతకాలము వచ్చునని మీరు చెప్పుదురు గదా. ఇదిగో మీ కన్నులెత్తి పొలములను చూడుడి; అవి ఇప్పుడే తెల్లబారి కోతకు

వచ్చియున్నవని మీతో చెప్పుచున్నాను'' (35 వ.). దీన్ని మరో విధంగా చెప్పాలంటే - ''నీవు విత్తనాలు విత్తేటప్పుడే, యింక నాలుగు నెలలలో కోతకాలం వస్తుందని మీకు తెలుసు. సమరయలోని పరిస్థితి అలాటిదేనని మీరు భావించ వచ్చు. విత్తనాలు యింతకు ముందే నాటబడ్డాయి; యిప్పుడు కోతకాలం వచ్చింది''! ప్రభువైన యేసు చెప్పినట్లు - ''పొలములు కోతకు వచ్చి తెల్లబారినవి'' అనేది - ఒకవేళ తెల్ల అంగీలు ధరించి తమ పట్టణమునుండి వస్తున్న సమరయులను సూచిస్తుందేమో.

## సంతుష్టి కరమైన పంట (యోహాను 4:39-42)

కోతకోసే దాని మీద యేసు తన సంభాషణ ముగించేటప్పటికి, సమరయులు వచ్చారు.

> ''- నేను చేసినవన్నియు నాతో చెప్పెనని సాక్ష్య మిచ్చిన స్త్రీ యొక్క మాటను బట్టి ఆ ఊరిలోని సమరయులలో అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి. ఆ సమరయులు ఆయన యొద్దకు వచ్చి, తమయొద్ద ఉండుమని ఆయనను వేడుకొనిరి గనుక ఆయన అక్కడ రెండు దినములుండెను'' (39-40 వచ.).

గలిలయకు వెళ్ల వలసిన ఒత్తిడి పనులున్నా, మిశ్రిత రక్తపు జనంతో ఆయన రెండు దినాలు గడిపారు. ఎందుకంటే - ప్రతి ఒక్కరు ఎవరో ఒకరైయున్నారు.

''ఆయన వాక్యమును బట్టి యింకను అనేకులు విశ్వాసముంచిరి'' (41 వ.). యేసును వారు వ్యక్తిగతంగా చూచినప్పుడు, ఆయన చెప్పేది ఏదో వారు విన్నప్పుడు, ఆయన వారి మధ్య ఎలా మసలుకొన్నారో వారు గమనించినప్పుడు, మనుష్యులందరిని ఆయన ఎలా ప్రేమించారో గుర్తించినప్పుడు అనేకులు ఆయనయందు విశ్వాస ముంచారు.

తృణీకరింపబడిన ఈ ప్రజలను ''కోతకు వచ్చిన పొల''మని యేసు సూచించడంలో, తగని చోట ఆయన తన నమ్మకాన్ని ఉంచారా? చివరి వచనాన్ని చూడు: వారు ''ఆ స్త్రీని చూచి - ఇక మీదట నీవు చెప్పిన మాటను బట్టి కాక, మా మట్టుకు మేమే విని, యీయన నిజముగా లోక రక్షకుడని తెలిసికొని నమ్ముచు న్నామనిరి'' (42 వ). అది ఎంతటి ఆశ్చర్యమైన ప్రతిపాదన! ''ఈయన నిజంగా లోక రక్షకుడని మేము తెలిసికొన్నాం''. ప్రభువును సన్నిహితంగా వెంబడించుతున్న ఆయన అపొస్తలులు ఆయన్ను కేవలం యూదులకే రక్షకుడనుకున్నారు. దేవుడు పేతురుకు ప్రత్యేకమైన దర్శనాన్ని యిచ్చేవరకు మరో విధంగా అర్థం చేసికోలేక పోయారు. కాని వారికి భిన్నంగా ఈ సమరయులైతే అంతకుముందే ఆయన్ను లోక రక్షకుడుగా చూచారు!

## ముగింపు

నీవు లోకంలో వుంటే, నీవు ఈ భూమి మీద చలిస్తుంటే - యేసు నీకు రక్షకుడు.

నీవు ఆయనకు ప్రత్యేకమైన వ్యక్తివి. ఆయన నిన్ను ప్రేమిస్తున్నాడు నీ కొరకు లక్ష్యపెడుతున్నాడు. గనుక నీకొరకు ఆయన సమయాన్ని తీసికొంటారు. ఆయన నీకొరకు చనిపోయారు. ఆయన నిన్ను ఎన్నడు విడువడు. ఎందుకు? ఎందుకంటె - ప్రతి ఒక్కరు ఎవరో ఒకరైయున్నారు.

---

## సువార్తికులకు ఉపదేశకులకు సూచన

"ప్రతి ఒక్కరు ఎవరో ఒకరైయున్నారు" అనేది ఒక పాయింట్ ప్రసంగం. ఈ ప్రసంగాన్ని పరిచయం చేస్తూ - ఆ మాటల దగ్గరకు వచ్చినప్పుడు ఆగి - శ్రోతలనే వాటిని పలుకమను. తరువాత పాఠాన్ని కొనసాగించు. ప్రతిసారి అక్కడికి వచ్చినప్పుడు ఆగు - వినే వారిచేతనే ఆ మాటలను పలికించు. కొన్నిసార్లు పెద్దగా అందరిని కలిసి చెప్పనీయ్. కావాలంటే ఆ మాటలు ఒక పేపరు మీద వ్రాసి - తగిన సమయంలో పైకెత్తు. శ్రోతలు పాలు పొందడం కొన్నిసార్లు క్షేమం.

సూచన

[1] Quoted by James Dobson, *Hide or Seek*, rev. ed. (Old Tappan, N.J.: Fleming H. Revell Co., 1979), 58